# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం 22 ఆగస్టు 2025 పేజీలు 8





గాజులరామారం 307 ఎస్ఎఫ్‌సి భూమిలోని గాలిపోచమ్మ బస్తీలో రెవెన్యూ కూల్చివేతలు..

# గాజులరామారంలో..!

# రెవెన్యూ కూల్చివేతలు..!


కూల్చివేతలను అడ్డుకున్న కబ్జాదారులు..!

గాజులరామారం "స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ" కేటాయించిన సర్వే నెం.307 భూమికి రక్షణ లేకుండా పోయింది.. ఎస్ఎఫ్‌సి అధికారులు నిర్లక్ష్యం ఒకవైపు, కబ్జాదారుల పలుకుబడి మరోవైపు, రూ.వందల కోట్లు విలువైన ఈ ప్రభుత్వ ఆస్తులతో కబ్జాదారులు కుబేరులు అవుతున్నారు.. 2019 వరకు ఖాళీగా ఉన్న 307 స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి చెందిన స్థలంలో, కబ్జాదారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు.. ఈజీగా డబ్బు సంపాదనకు, అధికారుల చర్యల జాప్యం తోడై, ఈ భూ కబ్జాలు అత్యంత సులువుగా మారాయి.. ఈ 307 భూమిలో రోజు రోజుకు కబ్జాదారుల బెడద మరింతగా పెరుగుతుంది.. 328 పట్టాభూమి పేరుతో, 329 ప్రభుత్వ భూమిని రాజమార్గంలో ఆక్రమిస్తుంటే.. అధికారులకు సిఫార్సుల బెడద పట్టుకుంది..

**దేవేందర్ నగర్ గాలిపోచమ్మ బస్తీలో 15 అక్రమ నిర్మాణాలు నేలమట్టం..**

- గత మంగళవారం (19 ఆగష్టు 2025న) కూల్చివేతలను కబ్జాదారుడు అడ్డుకోవడం..
- పోలీసుల భద్రతతో రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేతలు చేపట్టారు..
- సిఫార్సులను లెక్కచేయకుండా ప్రస్తుత తహశీల్దార్ కూల్చివేతలకు ఆదేశించారు..
- ఎస్ఎఫ్‌సి అధికారుల నిర్లక్ష్యంతోనే 307 లో ఈ భూకబ్జాలు అంటూ విమర్శలు..

-2లో

- కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో భారీ కూల్చివేతలు..
- సర్వే నెం.307 స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థకి కేటాయించిన ప్రభుత్వ భూమి..
- గాలిపోచమ్మ బస్తీలో రెచ్చిపోతున్న కబ్జాదారుడు నర్సిమ్మ..
- గతంలో బీఆర్ఎస్ నేతల అండతో గాలిపోచమ్మ బస్తీ ఏర్పాటు..
- ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలోనూ మళ్ళీ కబ్జాలకు పాల్పడుతున్న నర్సింహుడు..
- సర్వే నెం.307, 329, 342, రూ. వందల కోట్లు విలువచేసే భూమి కబ్జా..






పోలీసుల భద్రతతో రెవెన్యూ కూల్చివేతలు..307 లో

## మూసీ నది అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్లాన్ సిద్ధం చేస్తే కాంగ్రెస్ అంచనాలు పెంచింది

ప్రజల సొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని విమర్శ

రూ. 16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డీపీఆర్ సిద్ధం చేశామన్న కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను రూ. 1.50 లక్షల కోట్లకు పెంచిందని ఆరోపణ

**హైదరాబాద్ పెన్ పవర్:**మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం అన్ని ఏర్పాట్లు చేసి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను భారీగా పెంచి దోపిడీకి తెరలేపిందని ఆయన విమర్శించారు.మూసీ నది అభివృద్ధి

-2 లో




## కుట్రలకు పాల్పడే వారిని బయటపెట్టాలని కోరితే..

# నాపైనే కక్షకట్టారు

**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణి బొగ్గు గని కార్మికులకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ రాశారు. టీవీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారన్నారు. " రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగింది. సింగరేణి కార్మికుల కోసం

-2 లో



# గాజులరామారంలో..! రెవెన్యూ కూల్చివేతలు..!






**గాలిపోచమ్మ బస్తీ నిర్మాణానికి ముందు సర్వే నెం.307లో, ఆబిద్ ఎకరం కబ్జాతో ప్రారంభించి ఇప్పుడు వందల కోట్లకు ఎదిగినట్లు సమాచారం.. ఆతర్వాత గాలిపోచమ్మ బస్తి నిర్మాణంలో టిప్పర్ నర్సిమ్మ ప్రధాన కబ్జాదారుడు, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే, కబ్జాలు మొదలయ్యాయి.. దీంతో పాటు, 342లో రాజన్న బస్తి, మరికొన్న బస్తీలు ఏర్పడ్డాయి.. 329 ప్రభుత్వ భూమి వీణస్ రాక్ హైట్స్ వెంచర్ కబ్జాలోనూ 3 ఎకరాలు ఉన్నట్టు ఆరోపణ.. దినికి తోడు, పక్కనే కొత్త కబ్జాదారుల అరంగేట్రం, కబ్జాల జాతరలో, నేతల సిఫార్సులు తోడయ్యాయి.. సస్పెండ్ అయిన ఆ నలుగురు రెవెన్యూ సిబ్బంది, గతంలో కబ్జాదారులను విపరీతంగా ప్రోత్సహించి, వసూళ్ళకు పాల్పడిన వ్యవహారంలో ఆర్ఐ, సహా ముగ్గురు విఆర్ఏలను అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం అందరికీ తెలిసిందే.. ఆతర్వాత గతంలో రెవెన్యూ యంత్రాంగం, పోలీస్ భద్రతతో, భారీగా కూల్చివేతలు ప్రారంభించినప్పటికీ..! ప్రజా ప్రతినిధుల పలుకుబడి, అండతో మళ్ళీ మొదలు పెట్టారు..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 21:**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం ప్రభుత్వ భూముల కబ్జాలు రెవెన్యూ అధికారులకు సవాలుగా మారాయి.. ఒకప్పుడు భయం భయంతో, అడపా దడపా, ఏదో ఒక సమయంలో కబ్జాలకు పాల్పడిన ఘటనల నుండి, కూల్చివేతలను అడ్డుకునే స్థాయికి ఎదిగారు..మరోవైపు గాజులరామారం సర్వే నెం.307, 342, 329 ప్రభుత్వ భూములు బికారీలను కూడా, కుబేరులను చేసింది.. అందుకు గాలిపోచమ్మ బస్తీ కబ్జాదారులే అందుకు సాక్ష్యం.. గాజులరామారం సర్వే నెం.307 ఎస్ఎఫ్సి భూమిలో కబ్జాదారుడు నర్సిమ్మ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదుల మేరకు, గత మంగళవారం (19 ఆగష్టు 2025) కుత్బుల్లాపూర్ మండల తహశీల్దార్ ఆదేశాలతో, ఆర్ఐ ఖలీమ్, రెవెన్యూ సిబ్బందితో కూల్చివేతలకు వెళ్ళారు.. ముందస్తు విషయం తెలుసుకున్న కబ్జాదారుడు తన మనుషులతో అడ్డుపడ్డాడు. దీంతో జేసిబితో సహా రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.. వెంటనే పోలీస్ ప్రొటెక్షన్ కోసం తహశీల్దార్ కోరడంతో గురువారం పోలీసుల భద్రతతో కూల్చివేతలు చేపట్టారు..

**గత ఏప్రిల్ నెలలో గాజులరామారం 307 భూమిని సందర్శించిన హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, తక్షణమే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.. అయితే కబ్జాల నియంత్రణకు ఫెన్సింగ్ ఒక్కటే మార్గమని ఈ నిర్ణయం తీసుకున్నారు.. ప్రస్తుతం పార్కుస్థలాల అభివృద్ధికి నడుం బగించిన హైడ్రా, ప్రభుత్వ భూముల పరిరక్షణకు కూడా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.. ఇటు 307 భూమి కబ్జాలో ఎస్ఎఫ్సి అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.. రెవెన్యూ అధికారులపై భారం మోపి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు, అనధికారికంగా కబ్జాదారులకు సహకరిస్తున్నారని, సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. ఏదిఏమైనప్పటికీ హైడ్రా కమిషనర్ స్పందించి వెంటనే 307 ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు..**

## బ్జాదారులకు తహశీల్దార్ హెచ్చరిక..

గాజులరామారం దేవేందర్ నగర్ సర్వే నెంబర్ 307 స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో 15 అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన అనంతరం తహశీల్దార్ కబ్జాదారులను హెచ్చరించారు.. ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని అన్నారు.. కబ్జాదారుల వెనుక ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు..

## గాలిపోచమ్మ బస్తీ కబ్జాలపై.. రెవెన్యూ పంజా..

సర్వే నెం.307 ప్రభుత్వ భూమిలోని గాలిపోచమ్మ బస్తీలో అక్రమ కట్టడాలపై చర్యలకు వెళ్ళిన అధికారులను అడ్డుకోవడమే గాక.. పలు సిఫార్సుల ప్రయత్నం కూడా జరిగినట్లు సమాచారం.. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఈ కబ్జాదారుడు, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని, "ఏ ఎండకు ఆ గొడుగు" అన్న సామెతకు అద్దం పడుతున్నాడు.. మరోవైపు 307 కబ్జాలపై, సంబంధిత ఎస్ఎఫ్సి అధికారులు కూడా, నిర్లక్ష్యంతో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. అయినప్పటికీ కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు, పోలీసు భద్రతతో వెళ్ళి గురువారం 15 అక్రమ కట్టడాలను కూల్చేసినట్లు ఆర్ఐ ఖలీమ్ పెన్ పవర్ ప్రతినిధితో తెలిపారు..

### కుట్రలకు పాల్పడే వారిని బయటపెట్టాలని కోరితే..

# నాపైనే కక్షకట్టారు

- మొదటి పేజి తరువాయి

పోరాడుతుంటే నాపై కుట్ర పన్నుతున్నారు. భారత రాష్ట్ర సమితిలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు. నా తండ్రికి రాసిన లేఖను నేను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు. నాపై కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. నాపైనే కక్షకట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికాలో ఉన్న సమయంలోనే గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగింది. చట్టవిరుద్ధంగా టీవీజీకేఎస్ సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు" అని కవిత తెలిపారు.

### మూసీ నది అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్లాన్

## సిద్ధం చేస్తే కాంగ్రెస్ అంచనాలు పెంచింది

- మొదటి పేజి తరువాయి

కోసం అన్నీ సిద్ధం చేసి రూ. 16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డీపీఆర్ తయారు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను రూ. 1.50 లక్షల కోట్లకు పెంచడం శోచనీయమని ఆయన అన్నారు. ప్రజాధనం దుర్వినియోగాన్ని తాము కచ్చితంగా అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు. నాగోల్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల మేర సుందరీకరణ పనులు పూర్తి చేయడంతో పాటు ఉప్పల్ భగాయత్‌లో శిల్పారామాన్ని ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని హైదరాబాద్ సమీపంలోని కొండపోచమ్మ సాగర్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. అక్కడి నుంచి గండిపేట చెరువుకు తరలించడానికి 2022లోనే రూ. 1,100 కోట్లతో అనుమతులు కూడా మంజూరు చేశారని గుర్తు చేశారు. మూసీలోకి చేరే 2000 ఎంఎల్డీ మురుగునీటి శుద్ధి కోసం 36 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టి పూర్తిచేసినట్లు ఆయన వెల్లడించారు.



ఆస్కానీ మారుతీసాగర్. . సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి..

# కలం యోధులకు... న్యాయం చేయండి..!

## జర్నలిస్టుల రివ్యూ పిటిషన్‌ను..! తిరస్కరించిన సుప్రీంకోర్టు..!

- ఇళ్ళ స్థలాల విషయంలో మరోసారి నిరాశ..
- తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టులను ఆదుకోవాలని టియుడబ్ల్యుజే డిమాండ్..
- రూ.కోట్లు చెల్లించా.. ప్రత్యామ్నాయ ప్రాంతంలో స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి..
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయం బాధాకరం..

అల్లం నారాయణ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు..

**హైదరాబాద్, పెన్ పవర్, ఆగష్టు 21:**
జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) జర్నలిస్టుల రివ్యూ పిటిషన్‌ను తిరస్కరించడం అత్యంత బాధాకరమైన విషయమని, తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అభిప్రాయబడింది. గురువారం జరిగిన, పరిణామం వేదన భరితమైనదని పేర్కొంది.. దాదాపు 18 ఏళ్లుగా అనంత కోటి ఆశలతో ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు సుప్రీంకోర్టు రివ్యూ పిటిషన్‌ను కొట్టివేయడం తీవ్ర నిరాశను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్‌లు మాట్లాడుతూ 18 సంవత్సరాల క్రితమే కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి చెల్లించిన “జే.ఎన్.జే సొసైటీ” సభ్యులకు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వెంటనే అదే చోట ఇళ్ల స్థలాలు ఇప్పించే బాధ్యతను ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి దానిని అమలు చేయడం ద్వారా ఈ ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తే బాగుంటుందనే విషయాన్ని సూచించారు.. ఈ సొసైటీ సభ్యులకు ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు, ఇతర జర్నలిస్టులకు సైతం ప్రస్తుతం ముఖ్యమంత్రి మాట ఇచ్చిన ప్రకారం న్యూ సిటీలో ఇళ్ల స్థలాలను కేటాయించి జర్నలిస్టుల సొంతింటి కల సాకారాన్ని నెరవేర్చాలని కోరారు.. గత 30 ఏళ్లుగా హైదరాబాద్ నగరంలో జర్నలిజం వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న జర్నలిస్టులు ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు పొందలేక, ఉంటున్న ఇళ్లకు అద్దెలు చెల్లించలేక అపసోపాలు పడుతున్నారని వివరించారు. దీనిని ప్రధాన సమస్యగా గుర్తించి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో స్పందించి సత్వరమే ఒక మంచి నిర్ణయాన్ని తీసుకోవాలని విన్నవించారు..

## శ్లోక ది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు వృద్ధాశ్రమంలో జాతీయ వృద్ధుల దినోత్సవం



ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగస్ట్ 21: అల్మాస్ గూడ లోని శ్లోక ది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు చైర్మన్ జయపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి అంజనా శ్రీ, వైస్ ప్రిన్సిపల్ నరేష్ సమన్వయకర్తలు మరియు ఉపాధ్యాయులు సిబ్బంది కలిసి జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ లోని పి పి రిటైర్మెంట్ హోమ్స్ ను సందర్శించి వృద్ధులతో కలిసి వారితో కేక్ కట్ చేయించి మమేకమై పండ్లు పంపిణీ చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు.

## గణపతి మండపాలు ఏర్పాటు చేసే వారికి అలర్ట్.. ఆన్‌లైన్‌లో ఈ అనుమతులు తీసుకోవాల్సిందే !




హైదరాబాద్ పెన్ పవర్: గణపతి ఉత్సవాల సందడి మొదలైంది. తెలంగాణ వ్యాప్తంగా వినాయక చవితి కోసం ఇప్పటికే మండపాల నిర్మాణం జరుగుతుండగా.. కొన్ని ఏరియాల్లో పూర్తయ్యాయి కూడా. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి పోలీసులు ఆదేశాలు జారీ చేశారు.
గణపతి మండపాల ఏర్పాటుకు సంబంధించి నిర్వాహకులు ఆన్ లైన్ లో తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సిందిగా పోలీసులు సూచించారు. విద్యుత్ కనెక్షన్ కోసం కట్టాలని చెప్పారు. మండపాల కోసం సొంత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకూడదని ఆదేశించారు. డీడీ తీసుకుని మాత్రమే కరెంటు కనెక్షన్ ఇవ్వాల్సిందిగా సూచించారు. అదే విధంగా మండపాల నిర్మాణం ఎలక్ట్రిషియన్లు, నిపుణలతో మాత్రమే వేయించాల్సిందిగా సూచించారు.
రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున.. గాలి వానకు తట్టుకునేలా పకడ్బందీగా మండపాలను నిర్మించుకోవాలని సూచించారు పోలీసులు. అదే విధంగా ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పోలీసులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఆన్ లైన్ పర్మిషన్ కోసం పోలీస్ అధికారిక వెబ్ సైట్ ను సంప్రదించగలరు:

# ఆర్మూర్ ఆర్టీఏ ఆఫీసుపై ఏసీబీ దాడులు.. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్..




హైదరాబాద్ పెన్ పవర్:నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ లో ఆకస్మిక దాడులు నిర్వహించారు ఏసీబీ అధికారులు. గురువారం ( ఆగస్టు 21 ) ఆర్మూర్ ఆర్టీఏ ఆఫీసులో నిర్వహించిన ఈ దాడుల్లో మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ గుర్రం వివేకానంద రెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు. నిజామాబాద్ ఏజెంట్ నుంచి రూ. 25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు ఎంవీఐ వివేకానంద రెడ్డి.
బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఆర్టీఏ ఆఫీసుపై దాడి చేసి ఎంవీఐ వివేకానంద రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు అధికారులు. ఇదిలా ఉండగా.. అవినీతి అధికారులను కట్టడి చేయడంలో ఇటీవల దూకుడు పెంచారు ఏసీబీ అధికారులు. బుధవారం ( ఆగస్టు 20 ) సూర్యాపేట జిల్లా కోదాడలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అటవీశాఖ ఉద్యోగి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ దాడులకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. కోదాడలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గా పని చేస్తున్న వెంకన్న చెట్ల వ్యాపారి నుంచి రూ. 20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఏసీబీని ఆశ్రయించాడు బాధితుడు.
బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా వెంకన్నను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వెంకన్నను అదుపులోకి తీసుకున్న అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నల్గొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసులో సోదాలు నిర్వహించారు అధికారులు.

## వామ్మో.. ఇలా అయితే టమాట కొనేదెలా..? రెండు రోజుల్లోనే కొండెక్కి కూర్చున్న ధరలు.. మరింత పెరిగే ఛాన్స్ !





హైదరాబాద్ పెన్ పవర్:కూర ఏదైనా దాదాపు టమాట ఉండాల్సిందే. కూరగాయలు లేకుంటే కనీసం టమాట చారు, టమాట చెట్నీ చేసుకొనైనా పూట గడుపుతుంటారు సామాన్యులు. అలాంటిది టమాట ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఒకటి రెండు రోజుల్లోనే రేట్లు డబల్ కావడం ఆందోళన కలిగిస్తోంది. రెండు మూడు రోజుల కింద కిలో టమాట ధర 20 నుంచి 30 రూపాయల మధ్య ఉండగా.. సడెన్ గా రేట్లు డబల్ అయ్యాయి.
హైదరాబాద్ లో ప్రస్తుతం కేజీ టమాట ధర రూ.60 నుంచి రూ. 70 కి చేరుకుంది. దీంతో టమాట కొనేదెలా అనే ఆందోళన సామాన్యుల్లో మొదలైంది. నిన్నటి వరకు అందుబాటు ధరల్లో ఉన్న టమాట.. ఉన్నట్లుండి కొండెక్కి కూర్చుంది. హైదరాబాద్ లో ఏ ఏరియాకు వెళ్లినా టమాట ధరలు భగ్గుమంటున్నాయి. ఇతర జిల్లాల్లో పది రూపాయలు అటు ఇటుగా టమాట లభ్యమవుతోంది.సడెన్ గా టమాట ధరలు పెరగటానికి కారణం ఇటీవల కురిసిన వర్షాలే అంటున్నారు వ్యాపారులు. భారీ వర్షాల కారణంగా టమాట సప్లై తగ్గిపోయిందని చెబుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వానల కారణంగా పంటలు డ్యామేజ్ కావడంతో సప్లై తగ్గిపోయింది. టమాట కొరతతో నగరంలో టమాట దాదాపు రూ.70 కి చేరుకుంది. మార్కెట్లకు రోజువారీగా వచ్చే టమాటాలో సగం వరకు కూడా రావటం లేదని చెబుతున్నారు. దీంతో రానున్న రోజుల్లో రేట్లు మరింత పెరిగే ఛాన్స్ ఉందని అంటున్నారు.
తెలంగాణకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే టమాట కూడా తగ్గిపోయిందని వ్యాపారులు అంటున్నారు. ధరల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లోని టమాట ధరలు 50 నుంచి 60 రూపాయలకు చేరుకున్నాయి. ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం లాంటి నగరాల్లో టమాట ధరలు భగ్గుమంటున్నాయి. మరోవైపు ఇతర జిల్లాలు, రూరల్ ప్రాంతాల్లో 35 నుంచి 45 రూపాయల మధ్య టమాట అమ్ముతున్నారు.

## ఆ దేవుడికే తెలియాలి: కూకట్ పల్లి సహస్ర హత్య కేసులో వీడని మిస్టరీ.. చిన్నారితోనే నిజం సమాధి అయ్యిందా.. ?



**హైదరాబాద్ పెన్ పవర్:** కూకట్ పల్లి సహస్ర హత్య కేసులో మిస్టరీ ఇంకా వీడలేదు. గత నాలుగు రోజులుగా విచారణ జరుపుతున్నా చిక్కుముడి వీడని ఈ కేసు పోలీసులకు సవాల్ గా మారింది. సహస్రను చంపింది ఎవరు ?,ఇందుకోసం హత్య చేసి ఉంటారు ?, నిందితుడు ఎక్కడ ?, వంటి ప్రశ్నలకు పోలీసులు సైతం సమాధానం దొరకడం లేదు. ఈ కేసుకు సంబంధించి ఐదు టీమ్స్ తో దర్యాప్తు ముమ్మరం చేశారు పోలీసులు. గురువారం ( ఆగస్టు 21 ) సహస్ర తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్ కి పిలిచి విచారిస్తున్నారు పోలీసులు. సుమారు ఏడు గంటలపాటు సహస్ర పేరెంట్స్ ను విచారించిన పోలీసులు వారి దగ్గర నుంచి కీలక వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ హిస్టరీ, ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా ,ఇంటి సమీపంలో అనుమానితులు, పాత కక్షలు, కుటుంబ కలహాలు, గొడవలు, ఎవరి పైనైనా అనుమానం ఉందా అనే కోణంలో పేరెంట్స్ నుండి వివరాల సేకరించారు పోలీసులు. అయితే.. తమకు ఎవరిపై అనుమానం లేదని.. ఎవరితో గొడవలు లేవని సహాస్ర పేరెంట్స్ చెబుతుండటంతో ఈ కేసు మరింత క్లిష్టంగా మారింది. అంతే కాకుండా మూడో వ్యక్తి ప్రవేశించినట్లు ఎక్కడా కూడా క్లూ దొరకకపోవడం పోలీసులకు సవాల్ గా మారింది. ఈ క్రమంలో అంతుచిక్కని అనుమానాలు తెరపైకి వస్తున్నాయి.. ఇంట్లోకి ఎవరూ ప్రవేశించకపోతే.. సహస్రను చంపింది ఎవరు అన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఘటన జరిగిన బిల్డింగ్ లో ఉన్నవారిని, స్థానికులను కూడా ప్రశ్నించారు. మరి, పోలీసులకు సైతం ఛాలెంజింగ్ గా మారిన ఈ కేసు మిస్టరీ ఎప్పుడు వీడుతుందో చూడాలి.

## ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆన్ లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

**హైదరాబాద్ పెన్ పవర్:** బీహార్ లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ లిస్ట్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా.. విపక్షాలు చేపట్టిన నిరసనల మధ్య ఆన్ లైన్ గేమింగ్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందింది. బుధవారం లోక్ సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు ఇవాళ ( ఆగస్టు 21 ) రాజ్యసభ ముందుకొచ్చింది. రాజ్యసభలో వాయిస్ ఓట్ ద్వారా ఆన్ లైన్ గేమింగ్ ప్రమోషన్ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లు ఆమోదం పొందటం ద్వారా ఆన్ లైన్ మనీ గేమింగ్ కు మూడేళ్లు జైలు శిక్ష లేదా రూ. కోటి జరిమానా విధించేలా చట్టం అమల్లోకి వచ్చింది. గురువారం ( ఆగస్టు 21 ) ఆన్ లైన్ గేమింగ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి అశ్విని వైష్ణవ్. ఆన్ లైన్ మనీ గేమింగ్ డ్రగ్ అడిక్షన్ లాంటిదని.. ఆన్ లైన్ గేమింగ్ వెనుక ఉన్న పెద్ద తలకాయలు కోర్టులో ఈ బిల్లును సవాల్ చేస్తారని అన్నారు. ఆన్ లైన్ గేమింగ్ నిషేదానికి వ్యతిరేకంగా సోషల్ మీడియా ప్రచారం కూడా మొదలు పెడతారని అన్నారు. ఆన్ లైన్ గేమింగ్ ద్వారా వచ్చే డబ్బుతో ఉగ్రవాదానికి మద్దతివ్వడం కూడా చూశామని అన్నారు.రియల్ మనీ గేమింగ్ (పోకర్, ఫాంటసీ స్పోర్ట్స్) నిషేధించడం, ఈస్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ గేమ్స్, సోషల్ గేమ్స్‌ను ప్రోత్సహించడం ఈ బిల్లు లక్ష్యం. అలాగే భారత్‌ను గ్లోబల్ గేమింగ్ హబ్‌గా మార్చాలని కూడా టార్గెట్ పెట్టుకుంది కేంద్రం. ఈ బిల్లు ప్రకారం సెంట్రల్ ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఏర్పాటు చేస్తారు. ఇది గేమ్స్‌ను ఈస్పోర్ట్స్, ఎడ్యుకేషనల్, సోషల్, రియల్ మనీ గేమ్స్ అని నాలుగు రకాలుగా వర్గీకరిస్తుంది. రియల్ మనీ గేమ్స్ ను ఆఫర్ చేయొద్దు, వాటికి సహకారం అందివొద్దు.. అడ్వర్టైజ్‌మెంట్?నూ నిషేధించారు. బ్యాంకులు కూడా వీటి లావాదేవీలు చేయకూడదు.

# కవిత ఇక సిద్ధమయ్యారా? సోదరుడిని లక్ష్యంగా చేసుకున్నట్లుందిగా?




**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీకి ఇబ్బందికరంగా మారారు. ఇక ఆమె నేరుగా యుద్ధానికే దిగేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. గతంలో ఆఫ్ ది రికార్డుగానే విమర్శలు చేసే కల్వకుంట్ల కవిత ఈసారి మాత్రం బహిరంగ లేఖలతో బయటపడటం చూస్తుంటే కవిత ఎగ్జిట్ కు సిద్ధమయినట్లు కనిపిస్తుంది. తాను తగ్గేది లేదన్నట్లుగా ఆమె వ్యవహారశైలి ఉంది. బీఆర్ఎస్ తో సంబంధం లేకుండా తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్న కల్వకుంట్ల కవిత తనను టీజీబీకేఎస్ గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి తొలగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ భవన్ కు దూరమయిన కవిత ఇక బీఆర్ఎస్ కు కూడా దూరమవుతారా? అన్న సందేహాలు నెలకొన్నాయి.

### పదవి నుంచి...

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. సింగరేణి కార్మిక సంఘం నుంచి తనను తొలగించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీలో జరుగుతున్న వ్యవహారాలను తాను బయటపెట్టడమే తనపై ఈ కక్ష సాధింపు చర్యలు అని నేరుగా ఆరోపించారు టీజీబీకేఎస్ గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి తాను అమెరికా వెళ్లినప్పుడు తొలగించడమేంటని కవిత ప్రశ్నిస్తూనే గతంలో తనపై కుట్ర చేసిన వారే ఈ కుట్రకు కూడా పాల్గొన్నారు. ఆ కుట్రదారులే తనను అన్ని రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని కవిత ఆరోపించి ఒకరకంగా బీఆర్ఎస్ ను డిఫెన్స్ లోకి నెట్టారు. ఇక కవిత ఆరోపణలను కొట్టిపారేయకుండా చూస్తూ ఊరుకుంటే పార్టీ పట్ల ప్రజల్లో వేరే రకమైన అభిప్రాయం ఏర్పడుతుందని పలువురు గులాబీపార్టీ నేతలు నమ్ముతున్నారు.

### కుట్రదారులంటూ...

గతంలో తాను అమెరికాకు వెళ్లినప్పుడు గతంలో పార్టీ అధినేత కేసీఆర్ కు రాసిన లేఖను బయటపెట్టారని, ఇప్పుడు అమెరికాకు వెళ్లినప్పుడు కార్మిక సంఘం గౌరవాధ్యక్ష పదవి నుంచి తొలగించారని కవిత ఆరోపించారు. గతంలో తాను రాసిన లేఖను ఎవరు బయటపెట్టాలో చెప్పాలని తాను ఇప్పటికీ డిమాండ్ చేస్తున్నానని అన్నారు. తాను అమెరికాకు వెళ్లినప్పుడే పదవి నుంచి తొలగించడం కుట్రలో భాగమేనని అన్నారు. మొన్నామధ్య పార్టీ నేత జగదీశ్వర్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడిన కవిత ఈసారి మాత్రం కుట్రదారులంటూ

కొత్త వాదనకు తెరదీశారు. ఒకరకంగా చెప్పాలంటే తన సోదరుడు కేటీఆర్ పై ఈసారి బాణాలు ఎక్కుపెట్టినట్లు అర్థమవుతుంది. దీంతో అన్నా చెల్లెళ్ల రాజకీయ యుద్ధం వీధిన పడిందన్న వార్తలు మాత్రం తెలంగాణ రాజకీయాల్లో హల్ చల్ చేస్తున్నాయి.

# ఆ యువనేత హొటల్ కి రమ్మన్నాడు.. హీరోయిన్ సంచలన ఆరోపణలు!



**హైదరాబాద్ పెన్ పవర్:**కేరళ రాజకీయాల్లో మరోసారి లైంగిక వేధింపుల ఆరోపణలు పెద్ద దుమారానికి దారితీశాయి. మలయాళ నటి, జర్నలిస్ట్‌గా కూడా పనిచేసిన రినీ ఆన్ జార్జ్ చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ చర్చనీయాంశమయ్యాయి. రినీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక ప్రముఖ పార్టీకి చెందిన యువ నేత తనకు అసభ్యకరమైన సందేశాలు పంపి, హొటల్‌కు రావాలని ఆహ్వానించాడని ఆరోపించారు. ఈ విషయాన్ని పార్టీ నాయకత్వానికి తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆ నేతకు మరిన్ని అవకాశాలు కల్పించారని ఆమె వాపోయారు. “తమ కుటుంబంలోని మహిళలను కాపాడుకోలేని రాజకీయ నాయకులు, ఇతర మహిళలకు రక్షణగా ఎలా నిలుస్తారు?” అని ప్రశ్నించిన రినీ... తాను ఈ అనుభవాలను బయటపెట్టడానికి కారణం ఇంకా చాలా మంది మహిళలు మౌనంగా ఇలాగే బాధపడుతుండడమే అని స్పష్టం చేశారు.

### రాహుల్ మంఖూటతిల్‌పై బహిరంగ ఆరోపణలు

రినీ ఆరోపణలతో కాంగ్రెస్ ఎమ్మెల్యే, యూత్ కాంగ్రెస్ రాష్ట్రాధ్యక్షుడు రాహుల్ మంఖూటతిల్ పేరు బహిర్గతం కావడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. బీజేపీ కార్యకర్తలు రాహుల్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక రచయిత హనీ భాస్కరన్ కూడా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తూ రాహుల్‌పై తన అనుభవాన్ని బహిరంగం చేశారు. మొదట్లో సాధారణ సంభాషణలతో ప్రారంభమైన సందేశాలు, తరువాత అసభ్యంగా మారాయని ఆమె ఆరోపించారు. తన గురించి చెడుగా మాట్లాడినట్లు.. తప్పుడు ప్రచారం చేశాడని కూడా హనీ పేర్కొన్నారు.

### చర్యల లోపం.. పెరుగుతున్న ఆరోపణలు

హనీతో పాటు యూత్ కాంగ్రెస్‌లోనే పలువురు మహిళలు రాహుల్‌పై ఫిర్యాదులు చేసినా, ఇప్పటివరకు పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు రావడం మరింత చర్చనీయాంశమైంది. ముఖ్యంగా మహిళా ఓటర్ల మద్దతు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలతో కేరళ కాంగ్రెస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితిలో పడగా, రాష్ట్ర రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఇప్పుడీ ఆరోపణలపై పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? రాహుల్ భవిష్యత్తు ఏమవుతుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.

# నాపై దాడిలో మార్వాడీలకు సంబంధం లేదు.. బాయ్ కాట్ ప్రచారంతో సంబంధం లేదు : మోండా మార్కెట్ బాధితుడు




**హైదరాబాద్ పెన్ పవర్:**మార్వాడీ గోబ్యాక్.. మార్వాడీ గోబ్యాక్.. ఇప్పటి వరకు తెలంగాణ వ్యాప్తంగా వినిపిస్తున్న నినాదం ఇది. మీడియా, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇదే టాపిక్. పొలిటీషియన్స్ నుంచి సామాన్య ప్రజల వరకు అందరి నోటా ఇదే మాట. మార్వాడీలు ముతాగా ఏర్పడి స్థానిక వ్యాపారస్థుల పొట్ట కొడుతున్నారని.. ఎదగనీయటం లేదని.. మార్వాడీలు తెలంగాణ నుంచి వెళ్లిపోవాలని ఒక రాజకీయ యుద్ధమే మొదలైంది.

అయితే ఈ ఉద్యమానికి మూలబిందువైన ఘటనకు సంబంధించి బాధితుడు చేసిన స్టేట్ మెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటి వరకు మార్వాడీల దాడికి నిరసన చెబుతూ.. తనకు న్యాయం చేయాలని రోడ్డెక్కిన బాధితుడు.. చివరికి ఈ ఉద్యమానికి, మార్వాడీలకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించాడు. సికింద్రాబాద్ మోండా మార్కెట్ లో తనపై జరిగిన దాడికి మార్వాడీలకు ఎలాంటి సంబంధం లేదని దాడిలో గాయపడిన బాధితుడు సాయి పేర్కొన్నాడు. కేవలం తనకు, %ాఖ% జువెల్లర్స్ కు మధ్య మాత్రమే వివాదం జరిగిందని తెలిపాడు. గురువారం (ఆగస్టు 21) మార్వాడీ సంఘాలకు, బాధితుని కుటంబ సభ్యులకు మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఆ తర్వాత మీడియా సమావేశంలో ఈ వివాదానికి ముగింపు పలుకుతున్నట్లు బాధితుడు సాయి ప్రకటించాడు. సికింద్రాబాద్ పాట్ మార్కెట్లో మార్వాడీ అసోసియేషన్ తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో.. ఈ దాడికి మార్వాడీలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. బాయ్ కాట్ మార్వాడీస్.. గో బ్యాక్ మార్వాడీస్ ప్రచారంతో తనకు సంబంధం లేదని ప్రకటించాడు.

రోడ్ పై హారన్ వేయడం తో జరిగిన మొదలైందని.. అది ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు వరకు వెళ్లిందని చెప్పాడు బాధితుడు సాయి. అయితే గొడవకు పాట్ మార్కెట్ వ్యాపారస్తులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. మరోవైపు గొడవ జరిగినప్పుడు మార్వాడీ సమాజం తనతోనే ఉందని, హాస్పిటల్ లో తనకు అన్ని విధాల సహాయం అందించారని చెప్పాడు. ఈ దాడిపై సోషల్ మీడియాలో, మీడియాలో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని.. దీనికి ముగింపు చెప్పడానికే ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేశామని తెలిపాడు.

SK జువెల్లర్స్ ఓనర్స్ డబ్బు మదంతోనే దాడి చేశారని చెప్పాడు బాధితుడు సాయి. కులం పేరుతో దూషించింది కూడా నిజమేనని అన్నాడు. దాడి జరిగిన తర్వాత మార్వాడీ సమాజం అంతా తమతోనే ఉందని.. పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నమోదయ్యేవరకు తోడున్నారని తెలిపాడు. ఎన్నో ఏళ్లుగా టకారా బస్తీ వాసులు, మార్వాడీలు కలిసి మెలిసి ఉంటున్నామని.. తమ మధ్య ఎలాంటి వివాదాలు లేవని స్పష్టం తెలిపాడు. భవిష్యత్తులో కూడా కలిసే ఉంటామని తెలిపాడు. ఈ వివాదంపై ఇప్పటికే మీడియా ముఖంగా మాట్లాడేవాళ్లమని కానీ.. రాష్ట్రవ్యాప్తంగా వివాదం చెలరేగడం, కోర్టులో ఉండటంతో మీడియా ముందుకు రావద్దని పోలీసులు చెప్పడం వల్లనే ఆగినట్లు తెలిపారు. ఈ వివాదాన్ని ఇక్కడితో ఆపాలని.. ఏదైనా ఉంటే కోర్టులో చూసుకుంటామని తెలిపారు.మార్వాడీ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. మోండా మార్కెట్ లో జరిగిన దాడికి, మార్వాడీలకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. %ాఖ% జువెలర్స్ యాజమాన్యంపై సంఘంలో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్ అమీర్‌పేట్‌లో హనీ ట్రాప్.. 81 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ. ఏడు లక్షలు ఎలా కాజేశారో చూడండి !



**హైదరాబాద్ పెన్ పవర్:**హనీ ట్రాప్ గురించి తెలిసే ఉంటుంది. రొమాంటిక్ మెసేజెస్, సెక్సువల్ సంభాషణలతో ముగ్గులోకి దించడం. ఈ ట్రాపింగ్ కు యువకుల నుంచి వృద్ధుల వరకు బాధితులు అవుతూనే ఉన్నారు. పండు ముసలివాళ్లలో కూడా ఆశలు రేకెత్తించి ముగ్గులోకి దించి భారీ ఎత్తున డబ్బులు కొట్టేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. హైదరాబాద్ లో వెలుగులోకి వచ్చిన హనీ ట్రాప్ కేసు గురించి తెలిస్తే ఇంత ఈజీగా ముగ్గులోకి దింపుతారా.. ఇంత సింపుల్ గా డబ్బులు కొట్టేస్తారా..? అనే ఆశ్చర్యం కలగక మానదు.

అమీర్ పేట్ లో 81 ఏళ్ల వృద్ధుడిని హనీ ట్రాప్ చేసి మోసగించారు సైబర్ చీటర్స్. మాయా రాజ్ పుత్ అనే మహిళ పేరుతో వృద్ధుడికి కాల్స్ చేసి మాటల్లో దించారు దుండగులు. రొమాంటిక్ మెసేజెస్ తో ఆకట్టుకుని.. ఆ తర్వాత కాల్స్ చేసి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. జూన్ మొదటి వారం నుంచి వాట్సాప్ కాల్స్ ద్వారా వృద్ధుడిని లైన్లో పెట్టారు కిలాడీ స్కామర్స్.

వృద్ధుడితో చనువుగా మాట్లాడుతూ హనీ ట్రాప్ చేశారు దుండగులు. ఆ తర్వాత తమ పర్సనల్ ప్రాబ్లమ్స్ అంటూ కట్టుకథలు చెప్పి డబ్బులు గుంజడం ప్రారంభించారు. వైద్యం ఖర్చులు , ఫ్లాట్ రిజిస్ట్రేషన్ , తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు విడిపించడం కోసం అంటూ డబ్బులు లాగారు.

బాధితుడిని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి రూ.7 లక్షల 11 వేలు కాజేశారు స్కామర్స్. ఇంకా డబ్బులు డిమాడ్ చేయడంతో డౌట్ వచ్చిన వృద్ధుడు కుటుంబ సభ్యులకు చెప్పాడు. కుటుంబ సభ్యుల సహాయంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు బాధిత వృద్ధుడు. త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఆ ఆడియో ఫేక్ అని చెప్పాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గీయులు బెదిరిస్తున్నారు: ధనుంజయ



**హైదరాబాద్ పెన్ పవర్:**జూనియర్ ఎన్టీఆర్‌ను ఉద్దేశించి అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ వివాదం మరింత ముదురుతోంది. ఈ వ్యవహారం తాజాగా మరో కీలక మలుపు తీసుకుంది. ఎమ్మెల్యే వర్గీయుల నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తనపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు గుత్తా ధనుంజయ నాయుడు సంచలన ఆరోపణలు చేశారు.

ఎమ్మెల్యేకు సంబంధించిన ఆడియో క్లిప్‌ను తానే బయటపెట్టానని చెబుతున్న ధనుంజయ, ఈ విషయంపై మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదన వ్యక్తం చేశారు. “ఎమ్మెల్యే ప్రసాద్ వర్గీయులు నా భార్యకు, సోదరుడికి ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. ఆ ఆడియో నకిలీదని ప్రెస్ మీట్ పెట్టి చెప్పాలని నాపై ఒత్తిడి తెస్తున్నారు. ఎమ్మెల్యే వల్ల నా ప్రాణానికి హాని ఉంది. పార్టీ కోసం కష్టపడి జైలుకు కూడా వెళ్లాను” అని ధనుంజయ వాపోయారు. ఈ పరిణామంతో ఈ వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది.

**అసలేం జరిగింది?**

‘వార్ 2’ సినిమా విడుదల సందర్భంగా, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ హీరో ఎన్టీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అనంతపురంలో సినిమాను ఆడనివ్వనని హెచ్చరించారని ఆరోపిస్తూ ఒక ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఆడియోను ధనుంజయ నాయుడు లీక్ చేయగా, ఎమ్మెల్యేపై ఎన్టీఆర్ అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. అనంతపురంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరసన తెలిపి, ఆయన ఫ్లెక్సీలను చించివేశారు. ఎమ్మెల్యే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్‌తో పాటు ఆయన తల్లిని కూడా అవమానించిన ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

**ఎమ్మెల్యే వివరణ.. అధిష్ఠానం సీరియస్!**

మరోవైపు, ఈ ఆరోపణలను ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఖండించారు. తాను ఎప్పుడూ నందమూరి కుటుంబాన్ని గౌరవిస్తానని, ఆ ఆడియో తనది కాదని, అది నకిలీదని ఒక వీడియో ప్రకటనలో స్పష్టం చేశారు. ఇది తనపై జరుగుతున్న రాజకీయ కుట్ర అని ఆరోపించారు. అయినప్పటికీ, ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమాపణ చెబుతున్నానని పేర్కొన్నారు. ఈ వివాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తీవ్రంగా స్పందించినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే ప్రసాద్‌ను పిలిపించి వివరణ కోరినట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం ఆయనపై చర్యలు తీసుకోవాలని అభిమానులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి.. అనుమానాలు ఇవే




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని మియాపూర్ లో విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. అనుమానాస్పద స్థితిలో ఐదు మృతదేహాలు పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఒకే కుటుంబానికి చెందినవారిగా స్థానికులు వెల్లడించారు. మృతుల్లో అత్త, మామ, భార్య, రెండేళ్ల చిన్నారి ఉన్నారు. ఘటనాస్థలికి వెళ్లి పోలీసులు విచారిస్తున్నారు. మియాపూర్ పోలీసులుమాత్రం అనుమానాస్పద మృతిగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**అన్ని కోణాల్లో...**

ఆర్థిక కష్టాల వల్ల బలవన్మరణం పొందారా? లేక మరే ఇతర కారణాలతో మరణించారా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫుడ్ పాయిజినింగ్ అయిందన్న స్థానికుల ఆరోపణల నేపథ్యంలో ఆ దిశగా కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కర్ణాటక నుంచి ఉపాధి నిమిత్తం వచ్చి ఇక్కడ విగతజీవులుగా మారడాన్ని స్థానికులు తట్టుకోలేకపోతున్నారు. అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటకకు చెందిన వారిగా...

మృతులు కర్ణాటకలోని గుల్బార్గాకు చెందిన వారిగా గుర్తించారు. గుల్బర్గా జిల్లా సేడం మండలం రంజోలికి చెందిన అరవై ఏళ్ల లక్ష్మయ్య, యాభై ఐదేళ్ల వెంకటమ్మ, ముప్ఫయి రెండేళ్ల అనిల్, ఇరవై నాలుగేళ్ల కవితతో పాటు మరొక చిన్నారి కూడా ఉన్నారు. వీరంతా ఉపాధికోసం వచ్చి కూలీ పనులు చేసుకంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో అద్దెకు దిగి ఈరోజు ఆ ఇంటిని ఖాళీ చేయాల్సి ఉందని కూడా స్థానికులు అంటున్నారు. పోలీసులు మాత్రం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైల్లో వెళుతున్నారా అయితే ఒ మీ లగేజీని ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే




**హైదరాబాద్ పెన్ పవర్:** రైల్వే ప్రయాణికులకు భారం పడనుంది. ఇష్టమొచ్చిన తరహాలో తమ వెంట లగేజీని తీసుకు వెళ్లడానికి వీలులేదు. దానికీ ఒక ఇకపై లెక్కుండేలా రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. కీలక నిబంధన అమలులోకి రావడంతో ప్రయాణికులు తమ వెంట తీసుకునే లగేజీపై పరిమితులు మేరకు లగేజీ రుసుము కూడా చెల్లించాలీస ఉంటుంది. పరిమితికి మించి అధిక లగేజీ ఉంటే దానికి కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ విమానాశ్రయాలకే పరిమితమైన ఈ నిబంధన ఇకపై రైలు ప్రయాణాల్లో వర్తించేలా మార్పు తీసుకువచ్చింది.

**తప్పకుండా తనిఖీకి...**

ఈ నిబంధనల ప్రకారం ప్రయాణికులు తమ లగేజీని రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్లలో తప్పకుండా తనిఖీ చేయించుకోవాలి. రైల్వే శాఖ ప్రతి కోచ్కు నిర్దిష్ట బరువు పరిమితులను నిర్ణయించింది. ఈ పరిమితులను మించి లగేజీ తీసుకెళ్తే అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. వివిధ కోచ్ లలోప్రయాణించే వారికి నిర్దిష్టమైన లగేజీ తీసుకెళ్లాలని నిబంధనను విధించింది. ఫస్ట్ క్లాస్ ఏసీలో ప్రయాణించే ప్రయాణికులు డెబ్భయి కిలోల వరకు లగేజీని ఉచితంగా తీసుకెళ్లవచ్చు. దీనికి అదనంగా 15 కిలోల వరకు నామమాత్రపు ఛార్జీలతో తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది.

**లగేజీ పరిమితి ఇలా...**

ఏసీ టూ టైర్ కోచ్ లో అయితే యాభై కిలోల లగేజీ వరకూ ఉచితం. అదనంగా 10 కిలోల వరకు నామమాత్రపు ఛార్జీలు చెల్లించి తీసుకెళ్లవచ్చు. ఏసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్ లో ప్రయాణికులకు నలభై కిలోల వరకు లగేజీ ఉచితం. దీనికి అదనంగా 10 కిలోల వరకు నామమాత్రపు ఛార్జీలతో తీసుకెళ్లే అవకాశం ఉంది. సెకండ్ క్లాస్ లో ప్రయాణించే ప్రయాణికులకు 35 కిలోల వరకు లగేజీ ఉచితంగా అనుమతిస్తారు. దీనికి అదనంగా 10 కిలోల వరకు నామమాత్రపు ఛార్జీలతో తీసుకెళ్లే వీలుంది. పరిమితిని మించి లగేజీని తీసుకెళ్లేవారు అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రయాణ సమయంలో టీటీఈ తనిఖీ చేసి, బుక్ చేయని అదనపు లగేజీని గుర్తించినట్లయితే, సాధారణ ఛార్జీల కంటే ఆరు రెట్లు ఎక్కువ ఫైన్ విధించే అవకాశం ఉంది.

## విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి నామినేషన్..

### ప్రతిపాదిస్తూ సంతకం చేసిన సోనియా





**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. తెలంగాణకు చెందిన ప్రముఖ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి విపక్ష ఇండియా కూటమి తరఫున బరిలో నిలిచారు. ఈరోజు ఆయన తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీతో పాటు కూటమికి చెందిన 20 మంది ఎంపీలు ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ సంతకాలు చేయడం విశేషం.జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన ఆయన, న్యాయవ్యవస్థలో అంచెలంచెలుగా ఎదిగారు. 2005 నుంచి 2007 వరకు గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, 2007 నుంచి 2011 వరకు సుమారు నాలుగున్నరేళ్ల పాటు సేవలందించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి పదవీ విరమణ చేశాక, గోవా రాష్ట్రానికి లోకాయుక్తగా కూడా ఆయన పనిచేశారు.జగదీప్ ధన?డ్ ఇటీవల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. అధికార ఎన్డీఏ కూటమి తమ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ను నిలిపిన సంగతి విదితమే.

## సర్వీసులో మరణించిన సభ్యులకు పరిహారం పెంచిన EPFO..

## ఇకపై సాయం రూ.15 లక్షలు..!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్యోగి ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO) సెంట్రల్ బోర్డు ఉద్యోగుల కుటుంబాలకు మద్దతుగా మరింత బలమైన ఆర్థిక సహాయం అందించేందుకు సంబంధించిన కీలక ప్రకటన చేసింది. ఎవరైనా ఉద్యోగి సర్వీసులో ఉండగా మరణిస్తే వారి కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి ఎక్స్-గ్రేషియా సాయాన్ని గతంలో ఉన్న రూ 8.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించింది. ఈ మార్పు 1 ఏప్రిల్ 2025 నుంచి అమల్లోకి ఉంచుతున్నట్లు ఈపీఎఫ్ఓ వెల్లడించింది. పెంచిన మొత్తాన్ని మృతి చెందిన ఉద్యోగి కుటుంబ సభ్యులు లేదా లీగల్ హెయిర్లకు స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా అందించబడుతుంది. ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు ట్రస్టీలు, గవర్నమెంట్, ఎమ్ప్లాయర్స్, ఉద్యోగుల ప్రతినిధులు కలిసి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. దీనికి తోడు మరో శుభవార్త ఏంటంటే ఏప్రిల్ 1, 2026 నుంచి ప్రతి ఏటా ఈ ఎక్స్-గ్రేషియా మొత్తాన్ని ఏటా 5 శాతం చొప్పున పెంచే విధానానికి కూడా వారు అంగీకరించారు. ఈ ఏటా పెంపు నిర్ణయం కారణంగా మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక ఒత్తిడి తగ్గటంతో పాటు పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి కొంత ఉపశమనం పొందటానికి వీలు ఉంటుంది. ఈపీఎఫ్ఓ సంస్థ తన సభ్యుల కోసం 2025లో మరిన్ని మార్పులను ప్రకటించింది. మార్పుల ప్రకారం మరణించిన వ్యక్తి క్లెయిమ్ ప్రాసెస్ సులభరం చేస్తూ.. ఇకపై గార్డియన్ షిప్ సర్టిఫికెట్ అక్కర్లేకుండానే మైనర్ పిల్లల బ్యాంక్ ఖాతాల్లోకి సెటిల్మెంట్ డబ్బు జమచేయాలని నిర్ణయించారు. అలాగే తమ యూఏఎన్ ఖాతాకు ఆధార్ లింక్ చేయని లేదా వెరిఫై చేసుకోని వ్యక్తులు లేదా ఆధార్ వివరాల్లో తప్పులను సరిచేయాల్సిన వ్యక్తులకు డిక్లరేషన్ ప్రక్రియను సులభరం చేసింది ఈపీఎఫ్ఓ సంస్థ.

# పాక్‌లో జైషే కొత్త ఎత్తుగడ... డిజిటల్ హవాలాతో ఉగ్ర నిధులు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతున్నామని ప్రపంచానికి చెబుతున్న పాకిస్థాన్, తెరవెనుక ఉగ్రసంస్థలకు అండగా నిలుస్తున్న తీరు మరోసారి బయటపడింది. అంతర్జాతీయ ఆర్థిక కార్యదళం (ఎఫ్ఏటీఎఫ్) ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు, జైషే మహమ్మద్ (జైషే) ఉగ్రవాద సంస్థ 'డిజిటల్ హవాలా' అనే కొత్త మార్గాన్ని ఎంచుకున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. టెక్నాలజీని వాడుకుంటూ ఆన్‌లైన్ వేదికగా ఉగ్ర కార్యకలాపాలకు నిధులను సమీకరిస్తున్నట్లు వెల్లడైంది.



పాకిస్థాన్‌లో సులభంగా అందుబాటులో ఉండే ఈజీపైసా, సదాపే వంటి డిజిటల్ వాలెట్లను ఈ ఉగ్ర ముఠా తమ కార్యకలాపాలకు అస్త్రంగా మార్చుకుంది. జైషే అధినేత మసూద్ అజార్ కుమారుడు అబ్దుల్లా, ఖైబర్ ప్రావిన్స్ కమాండర్ సయ్యద్ సఫ్దార్ పేర్ల మీద ఉన్న ఖాతాలతో పాటు దాదాపు 250 ఇతర వాలెట్లను ఈ డిజిటల్ హవాలా కోసం చురుగ్గా వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఈ వాలెట్లకు వస్తున్న నిధుల మూలాలను కప్పిపుచ్చేందుకు, డబ్బును తరచూ వేర్వేరు ఖాతాలకు బదిలీ చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఒకవైపు ఉగ్రవాద నిర్మూలనకు కట్టుబడి ఉన్నామని పాక్ ప్రభుత్వం చెబుతున్నా, గతంలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో ధ్వంసమైన జైషే శిక్షణా కేంద్రాల పునర్నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా, కొత్తగా 313 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసే లక్ష్యంతో, ఆన్‌లైన్ ద్వారా చందాలు సేకరించి ఏకంగా 391 కోట్ల పాకిస్థానీ రూపాయలను సమీకరించాలని జైషే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిధులను ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, విలాసవంతమైన కార్ల కొనుగోలుతో పాటు మసూద్ అజార్ కుటుంబ నిర్వహణకు వాడుతున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి.

ఈ డిజిటల్ హవాలా నెట్‌వర్క్‌కు ప్రధానంగా గల్ఫ్ దేశాల నుంచి నిధులు వెల్లువెత్తుతున్నాయని, జైషే సేకరిస్తున్న మొత్తం నిధుల్లో 80 శాతం ఈ మార్గంలోనే వస్తున్నాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎఫ్ఏటీఎఫ్ నిబంధనలు పాటిస్తున్నామని పాక్ చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉగ్రవాద సంస్థలు టెక్నాలజీని వాడుకుని తమ కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

### ఎస్ఎల్‌బీసీ సొరంగం కోసం కీలక నియామకం..

## ఇరిగేషన్ శాఖకు కొత్త సలహాదారు

- తెలంగాణ ఇరిగేషన్ శాఖకు కొత్త సలహాదారు నియామకం
- రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ హర్ పాల్ సింగ్‌కు కీలక బాధ్యతలు
- రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న హర్ పాల్ సింగ్
- ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ మార్గం పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసే లక్ష్యంతో భారత సైన్యానికి చెందిన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ హర్ పాల్ సింగ్‌ను నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమించింది.

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం హర్ పాల్ సింగ్ రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ముఖ్యంగా ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను అధిగమించి, పనులను సకాలంలో పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆయన సేవలను వినియోగించుకోనుంది.

### రాహుల్ గాంధీ డ్రైవర్ పై ఎఫ్ఐఆర్ నమోదు...

## కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం

- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'లో అపశ్రుతి
- కాన్వాయ్ వాహనం తగిలి పోలీసు కానిస్టేబుల్‌కు గాయాలు
- రాహుల్ గాంధీ వాహన డ్రైవర్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు
- ఈ ఘటనపై రాహుల్‌ను విమర్శించిన బీజేపీ నేత షెహజాద్ పూనావాలా
- గాయపడిన కానిస్టేబుల్‌కు రాహుల్ గాంధీ పరామర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** బీహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఆయన కాన్వాయ్‌లోని వాహనం తగిలి ఓ పోలీసు కానిస్టేబుల్ గాయపడగా, ఆ వాహన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే రాహుల్ గాంధీ తన వాహనాన్ని ఆపి, గాయపడిన పోలీసుకి సహాయం చేశారు. ఈ ఘటన రాజకీయంగానూ కాక రేపింది.

వివరాల్లోకి వెళితే, నవాడా జిల్లాలోని భగత్ సింగ్ చౌక్ వద్ద రాహుల్ గాంధీ యాత్ర కొనసాగుతుండగా... ఈ క్రమంలో భద్రతా విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ అదుపుతప్పి కాన్వాయ్‌లోని వాహనం ముందు పడిపోయారు. దీంతో ఆ వాహనం ఆయన కాలిపై నుంచి వెళ్లడంతో గాయాలయ్యాయి. ఈ విషయంపై నవాడా ఎస్పీ అభినవ్ ధీమన్ స్పందిస్తూ, "డ్రైవర్‌పై కేసు నమోదు చేశాం. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తాం" అని తెలిపారు.

ఈ ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్ట్ చేస్తూ, "రాహుల్ గాంధీ కారు ఓ పోలీసును తీవ్రంగా గాయపరిచింది. కనీసం ఆగి చూడకుండా ఆయన వెళ్లిపోయారు" అని తీవ్ర విమర్శలు చేశారు.

అయితే, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన మరో వీడియోలో వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపించింది. ప్రమాదం జరిగిన వెంటనే రాహుల్ గాంధీ తన వాహనాన్ని నిలిపివేశారు. కిందపడిన కానిస్టేబుల్ వద్దకు వెళ్లి, ఆయన్ను పైకి లేపి తన జీపులోకి ఎక్కించుకున్నారు. ఆయనకు మంచినీళ్లు అందించి, ఓదార్చిన తర్వాతే తన యాత్రను కొనసాగించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ వర్గాలు కౌంటర్ ఇస్తున్నాయి. ఈ ఘటన ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.